భూసేకరణ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: నీటిపారుదల, రెవెన్యూ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయం చేసుకుంటూ పీఎన్, పీడీస్టేజిలో ఉన్నవి గడువు ముగించేలోగా భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో పాలమూరు-రంగారెడ్డి, కేఎల్ఐ ఇతర జలాశయ ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బొల్లారం, గోపాల్‌దిన్నె, బుద్దారం పెద్దచెరువులో భూసేకరణతో పాటు బండరావిపాకుల పునరావాస కేంద్రంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముంపు బాధితులకు పునరావాస కేంద్ర సమస్యలుంటే పరిష్కారం చేయాలని సూచించారు. అవార్డు స్టేజ్‌లో ఉన్న వాటికి వెంటనే అవార్డు పాస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటేశ్వర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, నీటిపారుదల ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, డీఈలు, సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి.. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలకు వైద్యమందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ, వైద్యశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో స్యామ్, మ్యామ్ పిల్లలు ఎంతమంది ఉన్నారని సిబ్బందినడిగారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉండి సరైన ఎదుగుదల లేని పిల్లలను గుర్తించాలన్నారు. మ్యామ్ పిల్లలకు బాలామృతం పౌష్టికాహారం అందించి సాధారణ స్థితికి తీసుకురావాలన్నారు. ప్రీ స్కూల్ షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ పిల్లలకు కనీస విద్యాభ్యాసం చేయించేందుకు అవసరమైన చిత్రలేఖనాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేయించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, జడ్పీ సీఈవో యాదయ్య, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారిణి పరిమళ, డీఈలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

చెంచులు.. చల్లంగుండాలని..!

ప్రత్యేక వైద్య సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి ● మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం

ఈనాడు, మహబూబ్‌నగర్
– న్యూస్‌టుడే, అమ్రాబాద్

నల్లమల చెంచుల అభ్యున్నతి, ఆరోగ్యం కోసం ఎన్ని కార్యక్రమాలు ప్రవేశపెట్టినా.. పూర్తి స్థాయిలో అమలవడం లేదు. పోషకాహారం, ఆరోగ్య వసతులు లేక అర్ధాంతర మరణాలతో జనాభా తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో దృష్టి సారిస్తేనే చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.



నల్లమలలోని ఓ చెంచు కుటుంబం

● నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ఏడేళ్లలో 620 మంది చెంచులు మృత్యువాత పడ్డారు. వీరిలో 80 శాతం మంది పౌష్టికాహారం, అనారోగ్య సమస్యలతో చనిపోయినవారే ఉన్నారు. చెంచు పెంటల్లో నివసిస్తున్న ఆదివాసీల ఆయు ప్రమాణాలు 50 ఏళ్ల లోపు పడిపోతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయి.

● గతంలో నాటి గవర్నర్ తమిళిసై అప్పాపూర్, బౌరాపూర్ చెంచు పెంటలను దత్తత తీసుకుని గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు రాజశ్రీ కోళ్లను ప్రతి కుటుంబానికి 10 చొప్పున అందించారు. బైకు అంబులెన్సులు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో మళ్లీ ఈ రెండు పెంటల్లో సాధారణ పరిస్థితులొచ్చాయి.

● వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ఆదివాసీల ఆరోగ్యంపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయగా పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలైతేనే చెంచుల ఆరోగ్యం బాగు పడుతుంది.

నల్లమలలోని ఈర్లపెంటలో మూడు నెలల క్రితం కాన్పు తర్వాత ఓ చెంచు మహిళ మృతి చెందింది. రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. బాలింత మృతి చెందిన కొన్ని రోజులకే శిశువు కూడా మృత్యువాత పడింది. మన్ననూరు ఐటీడీఏ పరిధిలో 88 చెంచు పెంటలున్నాయి. ప్రస్తుతం 8,400 జనాభా ఉంది. ఏటా ఈ జనాభా తగ్గుతుండటం ఆందోళన కలిస్తోంది. అనారోగ్య సమస్యలతోనే చిన్న వయసులో పలువురు మృతి చెందడమే దీనికి కారణం.



నిర్వహణ లేక వృథాగా ఉన్న బైకు అంబులెన్సు

సమీక్షలో చర్చకొచ్చిన అంశాలివీ..

● అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రుల్లో చెంచుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. అక్కడికి వెళ్లగానే నేరుగా వైద్యం అందించాలి.

● చెంచు పెంటల్లో బైకు అంబులెన్సుల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది, ఇంధన ఖర్చు వంటివి సమకూర్చాలి. వన్యమృగాల సంచారం నేపథ్యంలో బైకు అంబులెన్సుల్లో పెంటల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రత్యేకంగా అంబులెన్సును ఏర్పాటు చేసి సీటీస్కాన్, ఇతర పరీక్షలు నిర్వహించే సామగ్రిని అందుబాటులో ఉంచాలి.

● చెంచు పెంటల్లో ఔషధాల కోసం ప్రత్యేకంగా స్టోర్, డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేయాలి. మహిళల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● జ్వరాలు వస్తే చికిత్స కోసం వైద్య సిబ్బందే చెంచు పెంటల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలి.

● ఇక్కడ చాలా కుటుంబాలు సారాకు బానిసయ్యాయి. సంపాదన మొత్తం దీనికే ఖర్చు చేస్తున్నారు. అనారోగ్యంతో చిన్నతనంలోనే మృత్యువాత పడుతున్నారు. అచ్చంపేటలోనే డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారిలో మార్పు తీసుకురావాలి.

వసతులే లక్ష్యంగా ప్రతిపాదనలు..: నాగర్‌కర్నూల్ డీఎఫ్‌వో, మన్ననూరు ఐటీడీఏ పీవో బాధ్యతలను పర్యవేక్షిస్తున్న రోహిత్ గోపిడి 'ఈనాడు'తో మాట్లాడుతూ 14న చెంచుల ఆరోగ్యానికి కావాల్సిన ప్రతిపాదనలను అందించనున్నామన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి వైద్య సేవలు అందిస్తామన్నారు.

పరిహారం అందేదెప్పుడో..?

బాధిత రైతుల ఎదురుచూపులు



దావాజీపల్లిలో కేఎల్ఐ కాలువ తెగి వరిపైరుపై ఇసుకమేటలు వేసిన దృశ్యం

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: గత సెప్టెంబరు మొదటి వారంలో కురిసి అకాల వర్షాలకు జిల్లాలో పంటలకు, పశువులకు, నివాస గృహాలకు, చెరువులు, కాలువలకు తీవ్ర నష్టం జరగడంతో పాటుగా జనజీవనం అస్తవ్యస్తంగా మారిన విషయం విదితమే. అధికారులు నష్టం అంచనాలు తయారుచేసి కలెక్టరు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. కానీ నేటికి బాధితులకు నష్టపరిహారం అందలేదు. అకాల వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని, వారికి నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం భరోసాను కల్పించింది. నెల రోజులు దాటిపోయినా నష్టపరిహారం ఊసేలేదని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం, బాధలో ఉన్నప్పుడు ఓదార్చడం ప్రభుత్వాలు చేయాల్సిన కనీస పనులు. జిల్లాలో పలు విధాలుగా జరిగిన నష్టం ఇలా ఉంది.

వర్షాలతో నష్టం...

నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా చెరువులు, సాగునీటి కాలువలు తెగి నీరు ఉద్ధృతంగా ప్రవహించి వరి పంటలపై ఇసుక మేటలు వేసింది. మొత్తం 2006 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. వరి, వేరుసెనగ, జొన్న, మొక్కజొన్న, కంది, మిరప తదితర పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా మొత్తంగా 121 ఇళ్లు కూడా కూలాయి. జిల్లాలో ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వలకు 19చోట్ల గండ్లు పడగా 6 చెరువులు తెగిపోయాయి. చెరువులు, కాలువలకు త్వరితగతిన అధికారులు మరమ్మతులు చేశారు. ఇంకా రెండు మూడుచోట్ల కాల్వలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. జిల్లాలో అక్కడక్కడా పిడుగులు పడినా నష్టం వాటిల్లలేదు. కానీ పెద్దమందడి మండల పరిధిలోని బలిజపల్లిలో పిడుగుపాటుకు 6 గొర్రెలు, 4 మేకలు మృత్యువాత పడ్డాయి. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పిడుగుపాటుకు మరణించిన గొర్రెలు, మేకలకు సంబంధించి పంచనామా నిర్వహించి రూ. 1.03 లక్షల నష్టపరిహారం కోసం జిల్లా కలెక్టరు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. పంటల నష్టం వివరాలను గ్రామాల వారీగా ఏఈవోలు, ఏవోల ద్వారా సేకరించి ప్రభుత్వానికి పంపించారు.

వస్తుందో రాదో..

పిడుగుపాటుకు గురై మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష, కూలిన ఒక్కో ఇంటికి రూ. 16,500 లను రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంగా చెల్లించింది. కానీ పంటలు నష్టపోయిన రైతులకు మాత్రం నష్టపరిహారం ఇంకా అందలేదు. అది వస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం మేము నివేదికలు పంపించామని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తే చెల్లిస్తామని అంటున్నారు. పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆయుధాల వినియోగంలో నైపుణ్యం పెంచుకోండి: ఎస్పీ



ఆయుధంతో షూట్ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పోలీసు అధికారులు, సిబ్బంది పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి 10వ బెటాలియన్‌లో వనపర్తి జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయుధ పనితీరుపై శిక్షణ నిర్వహించి మాట్లాడారు. శిక్షణలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఆర్ఐ అప్పలనాయుడు, రిజర్వు, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు.. పట్టణాల్లో, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రావులగిరిధర్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెబ్బేరు మండలం రంగాపూర్ శివారు గోదాంలో సోమవారం జూదం ఆడుతూ పట్టుబడిన 15 మందిని అరెస్టు చేశామన్నారు. రూ. 6,35,600లు, 4కార్లు, 4ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కాత్యాయనిగా జోగులాంబ



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగులాంబ, కాత్యాయనీ దేవిగా భక్తులకు నేత్రపర్వం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకం, స్పర్శ దర్శనం, జోగులాంబకు కుంకుమార్చనలు, అలాగే యాగశాలలో చండీహోమం, సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కొలువు పూజ నిర్వహించారు. జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో అమ్మ వారి సన్నిధి నుంచి తీసుకు వచ్చి కొలువు పూజ పూర్తి చేశారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులుగా 1,131 మంది ఎంపిక
● నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తరువాత 1:1 నిష్పత్తితో తుది జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వివరాలను డీఈవోల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారు. ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నుంచి వారు ఎంపిక చేసుకున్న పోస్టు కోసం డిక్లరేషన్ తీసుకున్నారు. మరో పోస్టులో కూడా ఎంపికైన వారు ఉంటే వారి పేర్లను తొలగించి మెరిట్ జాబితాలో తదుపరి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జిల్లాల వారీగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి ఎంపికైన వారిని కలెక్టర్ కార్యాలయాల వద్దకు చేరుకోవాలని సమాచారం ఇచ్చారు.

అభ్యర్థుల తరలింపునకు 28 బస్సులు. .: ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద బుధవారం ఉదయం ఫొటో గుర్తింపు కార్డులు అందజేస్తారు. హైదరాబాద్‌లోని సీఎం సభకు వెళ్లేందుకు అధికారులు 28 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోగా ఎంపికైన వారికి పాఠశాలలను కేటాయించి సెలవుల తరువాత విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	ఎంపికైన ఉపాధ్యాయులు	ఆర్టీసీ బస్సులు
మహబూబ్‌నగర్	243	06
నాగర్‌కర్నూల్	285	07
జోగులాంబ గద్వాల	172	04
వనపర్తి	152	04
నారాయణపేట	279	07

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు తావుండొద్దు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో ఉమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద 26 గ్రామ పంచాయతీలలో గతేడాది చేపట్టిన అభివృద్ధి పనుల్లో చోటుచేసుకున్న లోటుపాట్లపై సామాజిక తనిఖీ బృందాలు సమర్పించిన తుది వివరాల ఆధారంగా బాధ్యుల నుంచి రికవరీకి ఆదేశించారు. లోటుపాట్లపై తనిఖీ బృందాలు నివేదికలు సమర్పించగా పెనాల్టీతో పాటు రికవరీకి ఆదేశించారు. ఏపీడీ నాగేంద్రం, సయ్యద్ సుల్తాన్, ఆడిట్ అధికారి రహీం, ఎంపీడీవో రాఘవ, ఎంపీవో సుదర్శన్, ఏపీవో సుకన్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ వేడుకలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టర్ కార్యాలయంలోని ఐడీవోసీ ప్రాంగణంలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని స్వయం సహాయ సంఘాలు, మెప్మా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ నిర్వహిస్తామని, మధ్యాహ్నం 3 గంటలకు ఐడీవోసీ ప్రాంగణానికి బతుకమ్మలతో రావాలని కోరారు.

తుంగభద్రలో 26,330 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో మంగళవారం 26,330 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 10 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.6 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.1 అడుగులుగా ఉంది. * సుంకేసుల డ్యాం నుంచి 4 గేట్లు ద్వారా 17,916 క్యూసెక్కులు, కేసీ కాల్వ ద్వారా 2,445 క్యూసెక్కులు మొత్తం 20,361 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం విడుదల చేశారు. డ్యాంలో 1.235 టీఎంసీల పూర్తిస్థాయి నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు: కొండా సురేఖ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కొండా సురేఖ

అలంపూర్, న్యూస్‌టుడే: పవిత్రమైన, ప్రాచీన శిల్ప సంపదకు ఆలవాలమైన అలంపూర్ ఆలయాలను అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఇక్కడ జరగనున్న కల్యాణోత్సవానికి మంత్రి మంగళవారం ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు. దేవాలయంలో పూజల అనంతరం టూరిజం వసతిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయం పురావస్తు శాఖ పరిధిలో ఉన్నందున ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర నుంచి కూడా నిధులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ పుష్కరాలకు వచ్చి ఆలయాల అభివృద్ధికి రూ. వంద కోట్లు మంజూరు చేస్తామని హామీ వచ్చి మరిచిపోయారని విమర్శించారు. అనంతరం ప్రసాద్ పథకం కింద జరుగుతున్న పనులను మంత్రి పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. మంత్రికి కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరించినా.. నిర్లక్ష్యమే

రెండు నెలల్లో పదవీ విరమణ.. అంతలోనే సస్పెన్షన్



సస్పెన్షన్‌కు గురైన ఆర్డీవో నాగరాజు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం వద్దంటూ కొల్లాపూర్ ఆర్డీవోను పలుమార్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు అప్రమత్తం చేశారు. హెచ్చరికలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆర్డీవో నాగరాజును సస్పెన్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధరణి దస్త్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరించటంతో ఓ మాజీ సర్పంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ధరణి విషయంలో ఆర్డీవో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఓఆర్‌సీల జారీ విషయంలో రైతులను ఎక్కువగా ఇబ్బందులకు గురిచేశారన్న ఫిర్యాదులున్నాయి. కార్యాలయంలో ప్రతి చిన్న పనికి డబ్బులు అడుగుతారనే విమర్శలున్నాయి. నాగరాజు మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. కొల్లాపూర్‌లో ఆయన ఏడాది నుంచి ఆర్డీవోగా కొనసాగుతున్నారు. విధుల్లో అలసత్వం, అవినీతి ఆరోపణలతో ఆర్డీవో సస్పెన్షన్ కావడం జిల్లాలో ఇదే మొదటిసారి. వివిధ ప్రాంతాల నుంచి ధరణి సమస్యలను పరిష్కరించాలని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికంగా ఫిర్యాదులు వస్తున్నా.. కొందరు అధికారుల్లో స్పందన లేదు. ప్రతి వారం 90 దరఖాస్తులు వస్తున్నా.. అధికంగా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇటీవలే తహసీల్దార్ల బదిలీలు అయ్యాయి. అంతకు ముందు కొందరు తహసీల్దార్లపై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. దస్త్రాలను పెండింగ్‌లో పెట్టడం.. బేరం కుదిరిన తర్వాతనే పరిష్కరించేవారనే ఆరోపణలున్నాయి. ఆర్డీవో స్థాయి అధికారిపైనే వేటు పడటంతో జిల్లాలోని రెవెన్యూ సిబ్బందిలో గుబులు మొదలైంది.

కలల కొలువు కైవసం

ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారు. కలల కొలువు కైవసం చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికవడంతో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా విజేతల మనోగతమిది..

- న్యూస్‌టుడే, బృందం



చిరకాల కల.. నెరవేరిందిలా 2012 డీఎస్సీలో 0.4 శాతం మార్కుల తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయాను. 2017లో ఒక మార్కు తేడాతో అవకాశాన్ని పోగొట్టుకున్నా. అచ్చంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా చేరాను. ఈసారి ఉద్యోగాన్ని సాధించాలన్న పట్టుదలతో డీఎస్సీకి సిద్ధమయ్యాను. స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) పరీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించా. కలల ఉద్యోగాన్ని సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎడ్ల రవి, లక్ష్మీపూర్ (ఉప్పునుంతల)



సంతోషంగా ఉంది: రోజూ 12 గంటలపాటు చదివాను. టీజీ డీఎస్సీ 2024లో సోషల్ స్టడీస్‌లో 75.53 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించి టీచర్ పోస్టుకు ఎంపికయ్యాను. సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనుండటం మరిచిపోలేను.

- టి.రేణుక, గద్వాల



పట్టుదలతో మూడు ఉద్యోగాలు.. : అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకున్నా. గురుకుల పీఈటీ ఉద్యోగానికి ఎంపిక కాగా ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నా. వసతి గృహ అధికారి ఉద్యోగానికి కూడా అర్హత సాధించాను. ధ్రువపత్రాల పరిశీలన చేయాల్సి ఉంది. తాజాగా డీఎస్సీలో పీఈటీ ఉద్యోగానికి అర్హత సాధించా.

- ముడావత్ శ్రీనివాస్‌నాయక్, పెద్దాయకుంట తండా(జడ్చర్ల)



హిందీ భాష పండితుడిగా..: మాది నిరుపేద గిరిజన కుటుంబం. 15 ఏళ్లుగా ప్రయివేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ వృత్తి చేపట్టాలన్న పట్టుదలతో నోట్స్ తయారు చేసుకుని చదివాను. ఆన్‌లైన్ తరగతులను ఉపయోగించుకున్నా. బోధనా వృత్తిలో ఉండటంతో కలిసొచ్చింది. రెండో గ్రేడ్ హిందీ భాష పండితుడి ఉద్యోగానికి ఎంపికయ్యాను.

- మూడావత్ రవి, వంకేశ్వరం (పదర)



ఎస్‌జీటీగా.. : మాది పేద వ్యవసాయ కుటుంబం. హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఖమ్మం ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను. 73.33 శాతం స్కోర్‌తో జిల్లా స్థాయిలో 19వ ర్యాంకు సాధించాను. సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగానికి (ఎస్‌జీటీ) ఎంపికయ్యాను.

- నెల్లికంటి హరీశ్, పదర



మొదటి ర్యాంకు రావటం ఆనందంగా ఉంది..: డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 84.37 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు పొందటం ఆనందంగా ఉంది. పాఠశాలలో పని చేస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను.

- గోపాల్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్



మూడో తరంలో కూడా.. : మా తాత ఉపాధ్యాయుడిగా పని చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. నేను మూడోతరం ప్రభుత్వ ఉపాధ్యాయిని. చాలా సంతోషంగా ఉంది. డీఎస్సీ ఎస్‌జీటీ విభాగంలో 77.38 మార్కులు సాధించి 24 ర్యాంకు కైవసం చేసుకున్నాను. అమ్మానాన్నల సహకారంతో ఈ విజయం సాధించాను.

- నవ్యశ్రీ, న్యూగంజ్, మహబూబ్‌నగర్



మా కుటుంబంలో తొలి ఉద్యోగం.. : అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. 11 గంటలపాటు చదివాను. 78.90 మార్కులతో 16వ ర్యాంకు పొందాను. మా కుటుంబంలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాను.

- శ్వేత, చిన్నదార్‌పల్లి(హన్వాడ)



తండ్రి స్ఫూర్తితోనే : నాన్న స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉపాధ్యాయ పరీక్షకు సన్నద్ధమయ్యా. డీఎస్సీలో 70.43 మార్కులతో జిల్లా స్థాయిలో 134 ర్యాంకు వచ్చింది. డీఈవో కార్యాలయం నుంచి ఉద్యోగ అర్హత సందేశం రావడంతో చాలా సంతోషంగా ఉంది.

- అనిత, భూత్పూర్



ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని..: 2017 డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం కోల్పోయా. అప్పటి నుంచి పట్టుదలతో సిద్ధమయ్యా. 84 మార్కులతో ఎస్టీబీ తెలుగు మాధ్యమంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

- తువ్వడి శివసాయి, మహబూబ్‌నగర్



కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

భూత్పూర్ : కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. మాది పేదకుటుంబం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. పోటీ పరీక్షల్లో 66.70 మార్కులతో ఉపాధ్యాయురాలిగా అవకాశం దక్కింది.

- తేజస్విని, అమిస్తాపూర్



లక్ష్యం నెరవేరింది: అమ్మానాన్న చిన్ననాటి నుంచే కూలీ పనులు చేస్తూ నన్ను చదివించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనే లక్ష్యంతో విద్యాభ్యాసం సాగించా. కొన్ని రోజులు ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తూ, సొంతంగా పరీక్షకు సిద్ధమయ్యా. 77.07 మార్కులతో పాలమూరు జిల్లా ఎస్‌జీటీలో 26వ ర్యాంకు సాధించా.

- దోకూరు అనిత, అమిస్తాపూర్




అవమానాలు ఎదుర్కొన్నా..: గత డీఎస్సీలో కొద్ది తేడాతో ఎస్‌జీటీ అవకాశాన్ని కోల్పోయాను. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదివాను. ఈ డీఎస్సీలో 70.8 శాతం మార్కులతో 49వ ర్యాంకు సాధించా. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్‌ఏ (జీవశాస్త్రం) ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నా.

- చింతల కార్తీక్, అచ్చంపేట



అమ్మ కష్టాన్ని చూసి ఉద్యోగం సాధించా..: నాన్న మృతిచెందడంతో అమ్మ శకుంతలమ్మ కూలీ పనులు చేస్తూ చదివించింది. అమ్మ కష్టాన్ని చూసి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివాను. ఎస్‌జీటీగా ఎంపికయ్యాను.

- శ్రీకాంత్, పెద్దమారూర్, చిన్నంబావి మండలం



రోజు ఏడు గంటలు చదివాను..: డీఎస్సీలో ఆంగ్లంలో నాకు జిల్లా మొదటి ర్యాంకు వచ్చింది. 6 నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రోజు ఏడు గంటలు చదివాను. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నియామకం సంతోషంగా ఉంది.

- అక్షయ్‌కుమార్, వనపర్తి



నాన్న, అక్కల స్ఫూర్తితో.. : నాన్న, అక్కల స్ఫూర్తితో నేను కూడా ఉపాధ్యాయురాలిని కావాలనే కోరిక నెరవేర్చుకున్నాను. డీఎస్సీలో 77.45 మార్కులతో ఓపెన్‌లోనే స్థానిక సంస్థల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ గణితంలో మొదటి ర్యాంకు సాధించాను.

- బి.సుమన, మహబూబ్‌నగర్



అయిజ: కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణ



వనపర్తి వల్లభ్‌నగర్‌లో ధనలక్ష్మి అవతారంలో.. దేవరకద్రలో వాసవీమాత అలంకరణ.. మహబూబ్‌నగర్: వాసవీ మాత ఆలయంలో.. అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి అలంకరణ..

తంగేడు పూల సోయగం.. బతుకమ్మ సంబరం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మండపాల్లో కుంకుమార్చనలు, వాడ వాడలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఉత్సాహంగా కోలాటాలు, దాండియా ఆడారు.

- న్యూస్‌టుడే బృందం



మహబూబ్‌నగర్: తలపై బతుకమ్మతో..



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించిన మహిళలు



మహబూబ్‌నగర్: బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



కొల్లాపూర్ : కోర్టు ఆవరణలో బతకమ్మకు పూజలు చేస్తున్న జడ్జీలు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్ తేజ, జోత్స్న



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కందనూలు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 25 జారీ చేసి ప్రభుత్వ పాఠశాలలు ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రతి తండాలో పాఠశాలలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, కిరణ్, రామస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్ ఫెలోషిప్‌కు పాలమూరువాసి



డా.జయపాల్

పాలమూరు, న్యూస్‌టుడే : బ్రెజిల్ దేశ ప్రతిష్ఠాత్మక 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్' ఫెలోషిప్‌కు మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని సంతోష్‌నగర్‌కు చెందిన డా. జయపాల్ ఎంపికయ్యారు. గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్‌కు మందులు కనుక్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా 20 మంది శాస్త్రవేత్తలను ఎంపిక చేయగా ఆసియా నుంచి డా. జయపాల్ ఒక్కరే చోటు సంపాదించారు. ఈ బృందానికి ఆయనే నాయకత్వం వహించనున్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసిన డా. జయపాల్ చైనాలో శాస్త్రవేత్తగా పనిచేశారు. కరోనా కాలంలో భారత్‌కు వచ్చి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పనిచేశారు. ప్రస్తుతం సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఆచార్యుడిగా కొనసాగుతున్నారు. 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్'కు దరఖాస్తు చేయగా మూడు విడతలుగా అంతర్జాలం ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కు ఎంపికవటం, చాలా దేశాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలకు తాను ప్రధాన శాస్త్రవేత్తగా నాయకత్వం వహించనుండటం ఆనందంగా ఉందని డా. జయపాల్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

తనిఖీ చేయకున్నా నియామకమా..?

పేట డీఈవో కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన





డీఎస్సీ అభ్యర్థుల నిరసనకు మద్దతు తెలుపుతున్న పీఆర్టీయూ టీఎస్, తపస్ జిల్లా అధ్యక్షులు.. డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలు జరిగాయని, ధ్రువపత్రాల తనిఖీ చేయని వ్యక్తికి ఎలా ఉద్యోగం ఇస్తారని పలువురు అభ్యర్థులు ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహ వీరికి మద్దతు తెలిపారు. జాబితా సవరించి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన అభ్యర్థులకు అధికారి తీరుతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. భాష పండిత్ (హిందీ)లో ఐదో ర్యాంకు వచ్చిన తనను కాకుండా అర్హత లేని, ధ్రువపత్రాల పరిశీలన చేయని అభ్యర్థిని ఎంపిక చేయడం సరికాదని భారతి అనే మహిళ అవేదన వ్యక్తం చేశారు. జుట్ల కవిత, తిమ్మప్ప అనే అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ సోషల్, తెలుగుల్లో ర్యాంకులు సాధించారు. తాము సోషల్ కోరుకుంటే తెలుగు ఎలా కేటాయిస్తారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో స్థానిక సీఐ శివశంకర్, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈవో అబ్దుల్ ఘని చెప్పినా ఆందోళనకారులు తగ్గలేదు. డీఈవో కార్యాలయం ఎదుట రాత్రి వరకు బైఠాయించారు. రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు ఒక్కొక్కరూ జమ అవుతుండటంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

అభ్యర్థులకు అన్యాయం జరిగింది : పీఆర్టీయూ

ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలతో డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,నాయకులు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

తపాలా శాఖ నిర్లక్ష్యంతో చేజారిన ఉద్యోగం

గత 27న మౌఖిక పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4న చేరిన లేఖ



తపాలా కార్యాలయం వద్ద ఆలస్యంగా వచ్చిన లేఖ చూపుతున్న యువకుడు నాగరాజు

జడ్చర్ల, న్యూస్‌టుడే : యువకుడికి సకాలంలో లేఖ అందకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగ అవకాశం చేజారిన ఘటన జడ్చర్లలో మంగళవారం వెలుగు చూసింది. బాధితులు, తపాలా శాఖ అధికారుల కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం గంగాపూర్‌కు చెందిన బి.నాగరాజు బీఎస్సీ చదివారు. 12 ఏళ్ల క్రితం తండ్రి చనిపోగా తల్లి, చెల్లి ఉన్నారు. ఏ జీవనాధారం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతూనే కుటుంబ పోషణ కోసం స్థానిక పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. 2023లో నాగరాజు తెలంగాణ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్‌లో ఉద్యోగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో పరిశీలన కోసం తన విద్యార్హత ధ్రువపత్రాలను పంపించారు. నాగరాజుకు మెరిట్ మార్కులు, జోనల్‌లో ఎస్సీ కోటాలో ఒకే ఉద్యోగం ఉండటంతో మౌఖిక పరీక్షకు అర్హత సాధించారు. సెప్టెంబర్ 27న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని కమిషన్ అధికారులు సెప్టెంబరు 4న అభ్యర్థికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. సకాలంలో హాజరుకాకపోయినా, ధ్రువపత్రాలు సరిగ్గాలేకపోయినా ఉద్యోగానికి అర్హత ఉండదని లేఖలో పేర్కొన్నారు. తపాలా శాఖ ద్వారా పంపిన లేఖ గడువు ముగిసిన తర్వాత ఈ నెల 4న అభ్యర్థి నాగరాజుకు అందింది. అతడు అధికారులను సంప్రదించగా మౌఖిక పరీక్షకు హాజరుకాకపోవడంతో మరొకరికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం చేజారిపోవడంతో బాధితుడు మంగళవారం జడ్చర్లలోని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లి ప్రశ్నించారు. దీనిపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గంగాపూర్ గ్రామంలో లేఖలు పంపిణీ చేసే శ్రీకర్ గత నెల 24న ఉద్యోగానికి రాజీనామా చేయటంతో మరో వ్యక్తి సర్దార్‌కు ఆ బాధ్యత అప్పగించామని పేర్కొన్నారు. గత నెల 18న అందించినట్లు తమ సిబ్బంది చెబుతున్నా అందులో నిజం లేదని, ఈ నెల 4వ తేదీనే అందినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. సకాలంలో లేఖ అందించకపోవడానికి కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగం చేజారడంతో బాధితుడు, కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.



క్రిష్ణవేణి

మాట వినడంలేదని మట్టుబెట్టాడు

భార్యను సుత్తితో బాది చంపిన భర్త

నార్సింగి, న్యూస్‌టుడే: భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని, తన మాట వినడం లేదని కోపం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెను సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఉదంతం హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ మాధవీనగర్‌లో వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరిక్రిష్ణారెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస సాగర్, క్రిష్ణవేణి(32) దంపతులు జీవనోపాధి కోసం వలసవచ్చి హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. తనను నిర్లక్ష్యం చేస్తోందని, చెప్పిన మాట వినటం లేదని భార్యపై శ్రీనివాస సాగర్ ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య తలపై సుత్తితో బాదడంతో ప్రాణాలు కోల్పోయింది. అనంతరం నిందితుడు ఇద్దరు పిల్లలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి

ధరూర్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్ షకూర్ కథనం మేరకు. . రేవులపల్లిలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలు డీజే సౌండ్ సిస్టమ్‌తో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో డీజే సౌండ్ తక్కువగా పెట్టాలని కృష్ణవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బతుకమ్మ ఊరేగింపు నిర్వాహకులకు కృష్ణవర్ధన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆర్మీజవాన్ మణివర్ధన్ తమ్ముడిపై కృష్ణవర్ధన్ దాడి చేశారు. విషయం తెలుసుకున్న మణివర్ధన్ బతుకమ్మ సంబరాల వద్దకు వచ్చి వారించటానికి ప్రయత్నించాడు. కోపోద్రిక్తుడైన కృష్ణవర్ధన్ సమీపంలో ఉన్న తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి మణివర్ధన్‌పై దాడి చేశాడు. మణివర్ధన్‌కు తీవ్ర గాయాలు కావటంతో గద్వాల ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇనుప కడ్డీ గుచ్చుకుని ఒకరి మృత్యువాత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: ఇనుప గ్రిల్ కడ్డీ గొంతుకు కుచ్చుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎర్రవల్లిచౌరస్తాలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. గద్వాల మండలం బసాపురం గ్రామానికి చెందిన కె.క్రిష్ణారెడ్డి(68) ఉద్యోగ విరమణ అనంతరం కొత్తకోటలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం ఎర్రవల్లిలో బంధువుల వద్దకు వచ్చాడు. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ వద్ద మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గ్రిల్‌పై పడ్డాడు. గొంతు నుంచి కడ్డీ తల భాగంలోకి చొచ్చుకుపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. అప్పన్నపల్లికి చెందిన పెంటయ్య గౌడ్(38)కు వెనుకా ముందు ఎవరూ లేకపోవటం, కటిక పేదరికంతో జీవితంపై విరక్తి చెంది అప్పన్నపల్లి వంతెన సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మదనాపురం : 8074538150 | వనపర్తి న్యూటౌన్ : 8008573864
అమరచింత : 9490237200 | వీపనగండ్ల : 9121229043

సమస్య: వనపర్తి పట్టణం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సఖి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారు రహదారిలో వాహనాలను నిలుపుతుండటంతో సఖీ కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోంది.
– శేఖర్, ఎన్టీఆర్ కాలనీ, వనపర్తి.

సమాధానం: సఖీ కేంద్రానికి సీసీ రహదారి నిర్మించే విషయాన్ని కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.
– పూర్ణచందర్, కమిషనర్ పురపాలిక వనపర్తి.

- న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర,** వెంకటేశ్వర: **రామ్‌నగర్‌బన్నీ**
శ్రీరామా: **శ్వాగ్** – న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్


వనపర్తిలో గాయత్రీమాతగా


పెద్దమ్మగుడి వద్ద ధనలక్ష్మీగా


కొత్తకోట : కానాయపల్లిలో శ్రీలలితదేవిగా


కొత్తకోటలో శ్రీలలితాదేవిగా..


ఖిల్లాగణపురంలో లక్ష్మీదేవిగా..


వనపర్తి: అచ్యుతపురం డబ్బులతో అలంకరణ


అంకూర్‌లో మహాలక్ష్మి రూపంలో

కనువిందుగా నవరాత్రి ఉత్సవాలు


అమరచింత : మహాచండిగా

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. వనపర్తి పట్టణంలోని గాంధీచౌక్, వాసవికన్యక పరమేశ్వరి ఆలయం, పెద్దమ్మగుడి, వెంగళరావునగర్, నాగవరం, కండక్టర్‌కాలనీ, రాంనగర్‌కాలనీ, ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్, పాత యూకోబ్యాంకు, వల్లబ్‌నగర్ ప్రాంతాల్లో దుర్గామాతకు పూజలు చేశారు. శ్రీరంగాపురం మండలంలో మహాలక్ష్మీ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కొత్తకోట కానాయపల్లి శ్రీకోటి లింగేశ్వరాలయంలో జ్ఞానాంబికదేవి శ్రీలలితదేవిగా, మండలంలోని రామకృష్ణాపురంలో శ్రీమహాలక్ష్మీ దేవిగా పూజలందుకున్నారు. కొత్తకోట పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రీలలితా దేవిగా, భవానీ శంకర దేవాలయంలో అర్ధనారీశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఖిల్లాగణపురం మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయంలో లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిమాత లక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. అచ్యుతపురం గ్రామంలో అమ్మవారికి గ్రామ ప్రజలందరు కలిసి రూ. 3,33,333 రూపాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆత్మకూరు పట్టణం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లలితా త్రిపురసుందరి అలంకరణలతో పూజలు నిర్వహించారు. పెబ్బేరు పట్టణంలో కన్యకా పరమేశ్వరీ ఆలయంలోని ప్రతిష్ఠించిన అమ్మ వారిని ఆర్యవైశ్య సంఘం సభ్యులు మంగళవారం రూ. 1,11,11,111 విలువైన నగదుతో శ్రీ లక్ష్మీదేవిగా అలంకరించారు. గోపాల్‌పేట చెన్నకేశవాలయం ముందు దుర్గాదేవి విగ్రహాన్ని మంగళవారం మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. అమరచింత రాజీవ్ కూడలిలో మహాచండి, కాళికాలయంలో అన్నపూర్ణదేవీ అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు.
- న్యూస్‌టుడే, బృందం


ఆత్మకూరు: నేతాజీనగర్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బతుకమ్మ సంబరాలు


పెబ్బేరు పట్టణంలో శ్రీ లక్ష్మీదేవిగా


ఆత్మకూరు: నీలకంఠేశ్వర ఆలయంలో పూజల్లో స్వర్ణకారులు

చెరకు రైతుల సమస్యలకు పరిష్కారం చూపండి


సీడీసీ ఛైర్మన్‌కి నియామక పత్రం అందజేస్తూ అభినందిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, న్యూస్‌టుడే: కృష్ణవేణి చక్కెర కర్మాగారం రైతులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలపై స్పందిస్తూ వాటికి పరిష్కారం చూపేలా చర్యలు ఉండాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. కృష్ణవేణి చక్కెర కర్మాగారం పరిధిలో చెరకు అభివృద్ధి మండలి ఛైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ విడుదల చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే ఆయనకు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రశాంత్, కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సాయిలు యాదవ్, మేస్త్రీ శ్రీనివాసులు, నవీన్ ఉన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆడెం వర్ష ఎంబీబీఎస్ సీటు సాధించడంతో మంగళవారం గ్రామస్థులు అభినందనలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మన్న, గోకారి, శివ, మూర్తి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


కొత్తకోటలో పురాతన కాలంనాటి సమాధులు

కొత్తకోట గ్రామీణం : కొత్తకోట సమీపంలో ప్రవహిస్తున్న పాలెం వాగు పరివాహక ప్రాంతంలో బృహత్ శిలాయుగం నాటి సమాధులు బయటపడ్డాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు బైరోజ్ చంద్రశేఖర్, డా.శ్యాంసుందర్ మంగళవారం ఈ సమాధులను గుర్తించారు. వారు మాట్లాడుతూ.. పూసలగడ్డగా పిలువబడే ఈ ప్రాంతంలో వాగు ఉత్తరతీరం వెంట బృహత్ శిలాయుగపు సమాధులున్నాయన్నారు. ఇవీ నాలుగు వైపుల పెద్ద బండ రాయితో నిర్మించి ఉంటాయన్నారు. సమాధి పక్కకు నిలిపిన సలపలు (ఆర్థోస్టాట్), నిలువు రాళ్లు (మెన్హిర్) ఉన్నట్లు ఆధారాలు లభించాయన్నారు. ఇవీ ఏళ్ల నాటి సమాధులుగా బృంద కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ఈ సమాధులలని వనపర్తి జిల్లాలోని కృష్ణానది పరివాహక గ్రామాలైన ఈర్లదిన్నె, శేరిపల్లి, పెద్దమరూరు, చిన్నమరూరు ప్రాంతాల్లో గుర్తించినట్లు తెలిపారు.


పాలెంవాగు పరివాహక ప్రాంతంలో సమాధులు పరిశీలిస్తున్న బృంద సభ్యులు

గ్రంథాలయంలో మెరుగైన వసతులు కల్పించాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి


వనపర్తి గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఇంటర్‌నెట్(అంతర్జాల) వసతి, దినపత్రికల సౌలభ్యం ఎలా ఉందని సిబ్బందినడిగారు. గ్రంథాలయ ఛైర్మన్ గోవర్ధన్‌సాగర్, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు.. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి సఖి కేంద్రాన్ని సందర్శించారు. సఖి కేంద్రంలో ఎన్ని కేసులు నమోదయ్యాయని సిబ్బందినడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది మాట్లాడుతూ.. ఇప్పటివరకూ 1980 కేసుల నమోదు కాగా 1860 కేసులు పరిష్కారమయ్యాయని, 120 కేసులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. జిల్లా సంక్షేమాధికారిణి లక్ష్మమ్మ, ఆర్డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, డీసీపీవో రాంబాబు, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, కేంద్ర సీఏ కవిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారులను మరమ్మతులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ సీఈవో యాదయ్య, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన స్వచ్ఛత



పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఇటీవల నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అసంపూర్తిగా ముగిసింది. మదనాపురం 9వ వార్డులో ఇళ్ల మధ్య అంతర్గత రహదారిపై పిచ్చి మొక్కలు తొలగించలేదు. దుప్పల్లిలో రామాలయం వీధి పక్కనే ఇళ్ల మధ్య మురుగు ఇలాగే దర్శనమిస్తోంది. దోమల బెడదతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారులను సంప్రదించగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, మదనాపురం

కనిపించని వీధిదీపాలు



మండలంలోని చెన్నూరులో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన మూడు ఆకాశ దీపాలు వెలగడం లేదు. ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇవి ఏడాది వరకు వెలిగాయి. అనంతరం మరమ్మతులకు గురి కావడంతో వాటి గురించి పట్టించుకోవడం లేదు. స్తంభాలపై దీపాలు, ఆన్‌ఆఫ్ పరికరాలు మాయమయ్యాయి. ఈ విషయమై మాజీ సర్పంచి శేషిరెడ్డిని ప్రశ్నించగా గతంలో అమర్చిన వీధిదీపాలు మెయింటెనెన్సు ఖర్చులు అధికంగా ఉండేవి, అందువల్ల గ్రామంలోని విద్యుత్తు స్తంభాలకే వీధిదీపాలను ఏర్పాటు చేశామని చెప్పారు. –న్యూస్‌టుడే, గోపాల్‌పేట

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

కొత్తకోట, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో సోషలిజాన్ని ప్రజలు ఆదరిస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పుట్ట ఆంజనేయులు తెలిపారు. మంగళవారం పట్టణంలో సీపీఎం మహాసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో సోషలిజానికి ప్రజలు ముందు వరుసలో ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి నరసింహా అధ్యక్షత వహించగా సీపీఎం శాఖ కార్యదర్శిగా బొబ్బిలి నిక్సన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాములు, బాలస్వామి, కురుమన్న, శేఖర్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి నిరంతర పోరాటం


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: ఇజ్రాయిల్ యుద్ధకాంక్షతో చేస్తున్న దాడులతో దాదాపు 8 శాతం జనాభా మరణించిందని, ఇప్పటికైనా ఇజ్రాయిల్ మరణకాండను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంయుక్త సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వామపక్షల పార్టీల నాయకులు పాలస్తీన దేశ ప్రజలపై ఇజ్రాయిల్ దాడిని నిలిపివేసి ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల ఆంజనేయులు, మండ్ల రాజు, రమేష్, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తకోటకు ఎంపీ డీకే అరుణ

కొత్తకోట, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యురాలు డీకే అరుణ బుధవారం కొత్తకోటకు వస్తున్నట్లు పార్టీ సభ్యత్వ ప్రముఖ్ వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు 11వ వార్డులో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14న కేంద్ర పథకాల అమలుపై సమీక్ష

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఈనెల 14న సమీక్ష నిర్వహించనున్నటు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి అన్నారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీ మల్లురవి, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ వివిధ శాఖ జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నేడు వనపర్తిలో ఎమ్మార్పీఎస్ నిరసన ర్యాలీ

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ చేయడంలో తెలంగాణ రాష్ట్రం ముందుంటుందని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుకు విరుద్ధంగా వెళుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ విమర్శించారు. మంగళవారం తాడిపర్తిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును కాదని డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాల్సిందిగా మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు బుధవారం వనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా కోకన్వీనర్ గట్టుస్వామి, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం : సమావేశంలో తాడిపర్తి గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేందర్, ఉపాధ్యక్షుడిగా సతీష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కార్యదర్శిగా వెంకటేష్, సలహాదారులుగా బాలవర్ధన్, జ్యోతినందన్, కోశాధికారిగా కురుమూర్తి, కార్యవర్గ సభ్యులుగా చంద్రకాంత్, శేఖర్, వినోద్‌లు ఎన్నికయ్యారు.


తాడిపర్తి అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌కు నూతన ఉపాధ్యాయులు

వనపర్తి పట్టణం : జిల్లా నుంచి డీఎస్సీ 2024 ఫలితాల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన 123 మందిని మూడు ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియానికి తీసుకెళ్లనున్నట్లు డీఈవో గోవిందరాజులు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో కలెక్టర్ జెండా ఊపి బస్సులు ప్రారంభిస్తారన్నారు. శంషాబాద్ సమీపంలో భోజన సౌకర్యం కల్పించామన్నారు. ఎస్జీటీలు 51, స్కూల్ అసిస్టెంట్లు 58, భాష పండితులు 8, పీఈటీలు 6 మంది నియామక పత్రాలు అందుకోనున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


గోపాల్‌పేటలో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : దసరా పండుగను పురస్కరించుకుని గోపాల్‌పేటలో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 7జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల భారాస అధ్యక్షుడు బాలరాజు, మాజీ సర్పంచి శ్రీనివాసులు, నాయకులు మతీన్, మణ్యంనాయక్, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.8వేలను అందజేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ పండగ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి ప్రయాణ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. డిపో పరిధిలోని మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత బతుకమ్మ పండగకు గుర్తింపు లభించిందన్నారు. ప్రయాణికులు వేడుకలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ మెకానికల్ దేవేందర్, మహిళా సిబ్బంది, బాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, స్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


వనపర్తి ప్రయాణ ప్రాంగణంలో బతుకమ్మలతో ఆర్టీసీ మహిళా సిబ్బంది

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ ఉత్సవాల్లో భాగంగా వనపర్తి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి బతుకమ్మ ఉత్సవాలను జరుపుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఆటపాటలతో ఆనందోత్సాహలతో బతుకమ్మ జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.


వనపర్తి బ్రహ్మంగారి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం: ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గిరిధర్, పాల్గొన్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు అపర్ణ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: విద్యార్థినులు ప్రేమ, పెళ్లి పేరుతో మోసపోవడం, ఆత్మహత్య చేసుకోవడం, చరవాణి అధికంగా వినియోగం వంటి వాటితో భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర బాలల హక్కు పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అపర్ణ ఆధ్వర్యంలో వనపర్తి ఎస్పీ కార్యాలయంలో శ్రామిక వికాస్‌కేంద్రం, చైల్డ్‌లైన్, వెల్ఫేర్ కమిటీ, సఖీ కేంద్రం, భరోసాకేంద్ర నిర్వాహకులతో బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, పోక్సోచట్టాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చరవాణి వినియోగం తగ్గించుకుని చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. ఉన్నత లక్ష్యం సాధన కోసం కృషి చేయాలన్నారు. జిల్లాలోని పలు శాఖల అధికారులు పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ కృష్ణకిశోర్, వనపర్తి, కొత్తకోట, సీఐ నాగభూషణంరావు, రాంబాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు


ఆత్మకూరులోని 7వ వార్డులో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న పుర ఛైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పారిశుధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు పురపాలిక ఛైర్‌పర్సన్ గాయత్రి హెచ్చరించారు. 7వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించిన సందర్భంగా ఆమె సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కమిషనర్ నాగరాజు, వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పెబ్బేరు పట్టణంలోని సుభాశ్ చౌరస్తా సమీపంలో ఓ కిరాణా దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం. . సోమవారం రాత్రి యజమాని దుకాణం మూసివేసి తాళం వేసివెళ్లారు. మంగళవారం దుకాణం తెరవడానికి వెళ్లిన రాధిక షట్టర్ తీసి ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించారు. తాళం పగలగొట్టి షాపులో ఉన్న రూ.5 వేల నగదు, రూ.10,000 విలువ చేసే సరకులను ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల రేషన్‌బియ్యం పట్టివేత

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు ఎస్ఐ నరేందర్, ఏఎస్సై బీచుపల్లి తెలిపారు. గస్తీ నిర్వహిస్తున్న సందర్భంగా మదనాపురం మండలం తిర్నాయపల్లి గ్రామం నుంచి మినీ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా వాహనంతో పాటు బియ్యాన్ని స్వాధీన పర్చుకొని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. పౌర సరఫరాలశాఖ డీటీ వేణుకు సమాచారం అందించగా.. పంచనామా అనంతరం ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై బీచుపల్లి వివరించారు.


పట్టుబడిన రేషన్ బియ్యం వాహనంతో పోలీసులు, పౌర సరఫరాల సిబ్బంది

పాన్‌గల్, న్యూస్‌టుడే : గ్రామాల్లో కొనుగోలు చేసి రాత్రి వేళ అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం రాత్రి గ్రామాలలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండలంలోని రాయినిపల్లి గ్రామంలో ఆటోలో బియ్యం బస్తాలు ఉండడంతో అనుమానంతో ఆటోను స్టేషన్‌కు తరలించామన్నారు. పౌరసరఫరాల ఉప తహసీల్దార్లు చాణుక్య, నందకిషోర్ పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని స్థానిక పౌరసరఫరాల గోదాంకు తరలించామన్నారు.

ఏటీఎం అద్దాలు ధ్వంసం

అమరచింత, న్యూస్‌టుడే : పట్టణంలో భాజపా జెండా కట్ట కూడలిలో ఉన్న ఇండియా 1 ఏటీఎం తలుపు అద్దాలను మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు రాయితో ధ్వంసం చేశారు. ఏటీఎంలో నగదు చోరీకి వచ్చిన వ్యక్తులే ఈ సంఘటనకు పాల్పడి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై నిర్వాహకులతో ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై బి.సురేశ్ పేర్కొన్నారు.


అమరచింత పట్టణంలో ఇండియా 1 ఏటీఎం అద్దాలను పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

హరియాణా ఎన్నికల విజయంతో భాజపా శ్రేణుల సంబురాలు


అమరచింత : బాణసంచా కాల్చుతున్న భాజపా శ్రేణులు

అమరచింత, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి మోదీ పాలనలో హరియాణా రాష్ట్రంలో భాజపా మూడోసారి శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల అమరచింత పట్టణంలో భాజపా శ్రేణులు గాంధీ కూడలి నుంచి భాజపా జెండా కట్ట వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీచేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో భాజపా జిల్లా నాయకులు మేర్వరాజు, అశోక్, నారాయణ, భాస్కర్, సిద్ధు, శ్రీను పాల్గొన్నారు.

కొత్తకోట, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా హ్యాట్రిక్ విజయం సాధించడం పట్ల కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. భాజపా చేస్తున్న అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని ఆపార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ కౌన్సిలర్ భరత్‌భూషన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంజీదామోదర్‌రెడ్డి, కార్యదర్శి నరేందర్‌గౌడ్, వనపర్తిశ్రీను, రాజారాం, బాలకృష్ణ, చక్రవర్తి, రాఘవేందర్‌గౌడ్, లచ్చగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : యువకులు మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో అఖిల భారత యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమణ, విష్ణు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


బీడీ కార్మికుల ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్య పనులు చేస్తున్న వైద్యాధికారిణి స్వాతి

అమరచింత, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి రక్ష అని బీడీ కార్మికుల ఆసుపత్రి వైద్యాధికారిణి స్వాతి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీడీ కార్మికుల ఆసుపత్రిలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. ఉమ్మడి జిల్లాలోని బీడీ కార్మికులు కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మంజూరయ్యే సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.